www.aksharadarbar.com
శుక్రవారం 25, అక్టోబర్ 2024
# అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :222 | పేజీలు : 05 | వెల : 05



రూ. వెయ్యి కోట్ల భూదందాలో

## అమోయ్ కుమార్ !

- అక్రమంగా 800 ప్లాట్ల స్థలానికి పాస్‌బుక్స్..
- ఈడీకి మధురానగర్ ప్లాట్ల యజమానుల ఫిర్యాదు
- రెండో రోజు విచారణకు హాజరైన సీనియర్ ఐఏఎస్..

04





# రూ 383 కోట్లు..

## వరంగల్ పశ్చిమలో నిధుల వరద

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. నియోజకవర్గ రూపురేఖలు మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. ప్రభుత్వాన్ని ఒప్పించి, మెప్పించి నిధుల వరద పారిస్తున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన పది మాసాల కాలంలో ఊహకందని విధంగా రూ. 383 కోట్లు రాబట్టి రికార్డు సృష్టించారు. ప్రజల సమస్యలు, స్థానిక అవసరాలు గుర్తించి పనులు చేపడుతున్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు పరిష్కారం చూపుతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ. 84 కోట్లతో నయీంనగర్ నాలాపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడమేగాక గడువు కంటే ముందే పూర్తి చేయించి విమర్శకులకు తనదైన స్టైల్‌లో గట్టి సమాధానం చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే పశ్చిమను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పరితపిస్తున్నారు. హామీల అమలు దిశగా సాగుతున్న రాజేందర్‌రెడ్డి అనతి కాలంలోనే నియోజకవర్గంపై తనదైన ముద్ర వేసుకుంటూ వడివడిగా ముందుకు కదులుతున్నారు.

- అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

- నియోజకవర్గంపై ఎమ్మెల్యే నాయిని తనదైన ముద్ర
- దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు పరిష్కారం
- గడువు కంటే ముందే నయీంనగర్ నాలాపై బ్రిడ్జి నిర్మాణం
- వరదలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు
- కాజీపేటలో ఆర్వోబీకి రూ. 76 కోట్లు..
- కాళోజీ కళాక్షేత్రం పూర్తిచేయడానికి రూ. 40 కోట్లు..
- పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు..
- హామీల అమలు దిశగా రాజేంద్రుడి అడుగులు

03



నడికూడ కేంద్రంగా

## రేషన్ బియ్యం దందా!

- అక్రమ బాగోతానికి కొందరు డీలర్లే వారధులు
- ఇల్లీగల్ బిజినెస్ లోనూ మధ్యవర్తిత్వం
- రేషన్ షాపులను అడ్డాగా మార్చుకున్న అక్రమార్కులు
- అన్ని తెలిసినా చోద్యం చూస్తున్న అధికారులు..

02

ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) రైస్ పక్కదారి పడుతోంది. పేదల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న పీడీఎస్ రైస్ ను అక్రమార్కులు లబ్ధిదారులకు చేరకుండా మార్కెట్ కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నా పట్టించుకోకుండా కొందరు రేషన్ షాపుల డీలర్లు తమ షాపుల నుంచే నేరుగా పీడీఎస్ రైస్ ను రైస్ మిల్లుల యజమానులు, బియ్యం వ్యాపారులకు సమకూర్చుతున్నట్లు తెలిసింది. ప్రతి నెల మొదటి తేదీలోగా సివిల్ సప్లై గోదాముల ద్వారా నిర్దేశిత రేషన్ షాపులకు ఠంచన్‌గా పీడీఎస్ బియ్యం సరఫరా అవుతోంది. అయితే స్టాక్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. - అక్షర దర్బార్, పరకాల

ఏసీబీ వలలో

## ఇద్దరు ఉద్యోగులు



- లంచం తీసుకుంటూ పట్టుబడిన ఘట్‌కేసర్ మున్సిపల్ ఏఈ రాజశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ షమీ

04

## కొండాకు బిగ్ షాక్

కేటీఆర్ పరువు నష్టం దావాపై సిటీ సివిల్ కోర్టులో విచారణ

భవిష్యత్‌లో ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దంటూ మంత్రి సురేఖకు ఆదేశం

04

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక



# నడికూడ కేంద్రంగా రేషన్ బియ్యం దందా!

- అక్రమ బాగోతానికి కొందరు డీలర్లే వారదులు
- ఇల్లీగల్ బిజినెస్ లోనూ మధ్యవర్తిత్వం
- రేషన్ షాపులను అడ్డాగా మార్చుకున్న అక్రమార్కులు
- అన్ని తెలిసినా చోద్యం చూస్తున్న అధికారులు..

అక్షర దర్బార్, పరకాల: ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) రైస్ పక్కదారి పడుతుంది. పేదల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న పీడీఎస్ రైస్ ను అక్రమార్కులు లబ్ధిదారులకు చేరకుండా మార్కెట్ కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నా పట్టించుకోకుండా కొందరు రేషన్ షాపుల డీలర్లు తమ షాపుల నుంచే నేరుగా పీడీఎస్ రైస్ ను రైస్ మిల్లుల యజమానులు, బియ్యం వ్యాపారులకు సమకూర్చుతున్నట్లు తెలిసింది. ప్రతి నెల మొదటి తేదీలోగా సివిల్ సప్లై గోదాముల ద్వారా నిర్దేశిత రేషన్ షాపులకు ఠంచన్‌గా పీడీఎస్ బియ్యం సరఫరా అవుతుంది. అయితే స్టాక్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన రెవిన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంతో లబ్ధిదారులకు చేరాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతుంది. ప్రతి నెల ఒకటి నుండి 20వ తేదీ వరకు లబ్ధిదారులకు చౌక డిపోల ద్వారా రేషన్ బియ్యం ఇవ్వాల్సి ఉండగా డీలర్లు కొందరు బియ్యం అక్రమ వ్యాపారం చేసే వారితో కుమ్మక్కై రేషన్ షాపులో అక్రమార్కుల సహాయంతో వేలిముద్రలు పొంది ఆటోల ద్వారా తమ అడ్డాకు పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలిసింది. నడికూడ మండలంలోని వివిధ గ్రామాలు కేంద్రంగా ఈ పీడీఎస్ రైస్ అక్రమ దందా జోరుగా సాగుతున్నట్లు సమాచారం. నడికూడ మండల కేంద్రంలో ఉన్న రెండు రేషన్ షాపులు సహా ఈ మండలంలో మొత్తం 26కు పైగా రేషన్ షాపులు ఉన్నట్లు తెలిసింది. వీటిలో కొన్ని షాపుల్లో రేషన్ బియ్యం అక్రమాలు జరుగుతున్నాయని పలు సందర్భాల్లో సంబంధిత అధికారులకు ఫిర్యాదులు అందాయి. అయినా అధికారులు పట్టించుకోపోతుండటం స్థానికంగా చర్చనీయాంశమైంది.

**- అక్రమార్కులకు అడ్డాగా..**

ఈ మండలంలోని కొన్ని గ్రామాలు రేషన్ బియ్యం అక్రమ వ్యాపారానికి అడ్డాగా మారినట్లు స్పష్టంగా కనబడుతుంది. గత రెండు మూడు నెలల నుంచి ఈ మండలంలోని చర్లపెల్లి, పులిగిల్ల, నర్సకపల్లి తదితర గ్రామాల్లో టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు జరిపి పిడిఎస్ రైస్ నిలువలను పట్టుకోవడం ఇందుకు నిదర్శనం. నడికూడ మండలం నుంచి భూపాలపల్లి మీదుగా మహారాష్ట్రకు పీడీఎస్ బియ్యం తరలి వెళుతున్నాయని స్థానికులు చెప్తున్నారు. ఇంత జరుగుతున్నా పిడిఎస్ బియ్యం అక్రమ వ్యాపారాన్ని కంట్రోల్ చేయాల్సిన రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. చర్యలు లేకపోవడం వల్ల రేషన్ బియ్యం అక్రమార్కులకు రెవెన్యూ శాఖలోని కొందరు అధికారుల సహకారం ఉందా? అనేది ఇక్కడ చర్చనీయమైంది.



ర్యాలీలో పాల్గొన్న పీడీఎస్ యూ నాయకులు

# అసమానతలు రూపుమాపాలి

- వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలి
- పీడీఎస్ యూ 50 ఏళ్ల పోరాట స్ఫూర్తి సభలో వక్తలు

అక్షరదర్బార్, హనుమకొండ: సమాజంలో అసమానతలు, వివక్షతలకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం 50 ఏళ్ల పోరాట స్ఫూర్తి సభ పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన యూనివర్సిటీ ఆర్ట్స్ సైన్స్ సైన్స్ కళాశాల ఆడిటోరియం గ్రౌండ్స్ లో జరిగింది. సభకు ముందు ఏకశిలా పార్కు నుంచి వేలాదిమంది విద్యార్థులు స్ఫూర్తి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సభలో ప్రధాన వక్తలుగా హాజరైన ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ.. 1974లో ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, ప్రసాద్ నాయకత్వంలో ఏర్పడిందన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలను నిర్వహించి ఎన్నో విజయాలు సాధించిందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రైవేటు రంగంలో మెడికల్ కాలేజీల ఏర్పాటును వ్యతిరేకించి ప్రభుత్వాలను గద్దెదింపిన చరిత్ర రాష్ట్రంలో పీడీఎస్‌యూకు మాత్రమే ఉందని అన్నారు. తన పరిణామ క్రమంలో ఎన్నో రాజ్య నిర్బంధాలకు గురికావడమే కాకుండా విలువైన ప్రాణ త్యాగాలు చేసిందని, విద్యార్థి అమరవీరులు కలిగిన సంస్థగా రక్తాక్షరాలతో లిఖించుకున్న మహోజ్వల చరిత్ర పీడీఎస్‌యూకు ఉందని తెలిపారు.

# మండల ప్రజలు సంతోషంగా ఉండాలి

**కాంగ్రెస్ శాయంపేట అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి**

అక్షర దర్బార్ ,శాయంపేట : శాయంపేట మండల ప్రజలు సంతోషంగా ఉండాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని గోవిందాపూర్ శివారులో వాహెబ్ నగర్ దర్గా షరీఫ్ ను పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారపెల్లి రవీందర్ తో కలిసి దర్శించుకున్నారు. జెండా పండుగలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. వేడుకల్లో మండల ఉపాధ్యక్షుడు మారపల్లి కట్టయ్య, నిమ్మల రమేష్, భిక్షపతి, విష్ణు, నాగరాజు పాల్గొన్నారు.



వాహెబ్ నగర్ దర్గా షరీఫ్ లో ప్రార్థనలు చేస్తున్న పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్

# ఢిల్లీకి మహేశ్ కుమార్ గౌడ్

- రేపు, ఎల్లుండి రాజధానిలోనే పీసీసీ చీఫ్
- ఏఐసీసీ పెద్దలతో భేటీ
- రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులపై అగ్రనేతలతో చర్చించే అవకాశం


అక్షరదర్బార్, హైదరాబాద్: టీ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ శుక్రవారం ఢిల్లీ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఇవాళ, రేపు ఆయన ఢిల్లీ టూర్‌లో ఉండనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఏఐసీసీ పెద్దలతో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై పార్టీ అగ్రనేతలతో చర్చించే అవకాశం ఉన్నదని తెలుస్తోంది. కాగా ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్‌లో కార్యవర్గ కూర్పుతోపాటు మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ, పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై జీవన్ రెడ్డి వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి. ఇటువంటి పరిస్థితుల్లో పార్టీ అధిష్టానంతో పీసీసీ చీఫ్ జరపబోయే చర్చలు కీలకంగా మారనున్నాయి. అలాగే రేపు వీహెచ్ హనుమంతరావు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలోనూ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొననున్నారు.



# ఫారెస్ట్ అధికారులపై దాడి..

- ఆముదాలపల్లి శివారులో పోడు సాగుకు యత్నం
- అడ్డుకున్న అటవీ శాఖ అధికారులపై దాడి
- బేస్ క్యాంప్ ఉద్యోగికి తీవ్ర గాయాలు
- మూడు ట్రాక్టర్లు సీజ్.. నిందితులపై కేసు

అక్షరదర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి మండలం ఆముదాలపల్లి శివారు అటవీ ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి అటవీశాఖ అధికారులపై పోడు సాగుదారులు దాడికి దిగారు. స్థానికులు పలువురు పోడు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారంతో భూపాలపల్లి రేంజ్ ఆఫీసర్ నరేష్ ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈక్రమంలో పోడుదారులు అటవీశాఖ సిబ్బందిపై దాడికి తెగబడ్డారు. బేస్ క్యాంప్ ఉద్యోగి జె సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో హుటాహుటిన భూపాలపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మూడు ట్రాక్టర్లు సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



- నియోజకవర్గంపై ఎమ్మెల్యే నాయిని తనదైన ముద్ర
- దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు పరిష్కారం
- గడువు కంటే ముందే నయీంనగర్ నాలాపై బ్రిడ్జి నిర్మాణం
- వరదలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు
- కాజీపేటలో ఆర్వోబీకి రూ. 76 కోట్లు..
- కాళోజీ కళాక్షేత్రం పూర్తిచేయడానికి రూ. 40 కోట్లు..
- పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు
- హామీల అమలు దిశగా రాజేంద్రుడి అడుగులు



# రూ.383 కోట్లు..

## వరంగల్ పశ్చిమలో నిధుల వరద

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. నియోజకవర్గ రూపురేఖలు మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. ప్రభుత్వాన్ని ఒప్పించి, మెప్పించి నిధుల వరద పారిస్తున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన పది మాసాల కాలంలో ఊహకందని విధంగా రూ. 383 కోట్లు రాబట్టి రికార్డు సృష్టించారు. ప్రజల సమస్యలు, స్థానిక అవసరాలు గుర్తించి పనులు చేపడుతున్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు పరిష్కారం చూపుతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ. 84 కోట్లతో నయీంనగర్ నాలాపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడమేగాక గడువు కంటే ముందే పూర్తి చేయించి విమర్శకులకు తనదైన స్టైల్‌లో గట్టి సమాధానం చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే పశ్చిమను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పరితపిస్తున్నారు. హామీల అమలు దిశగా సాగుతున్న రాజేందర్‌రెడ్డి అనతి వీకాలంలోనే నియోజకవర్గంపై తనదైన ముద్ర వేసుకుంటూ వడివడిగా ముందుకు కదులుతున్నారు.

### నిధుల వరద..

నాయిని రాజేందర్‌రెడ్డి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేగా గెలిచిన పది మాసాల కాలంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏకంగా రూ. 383 కోట్ల నిధులు తీసుకొచ్చారు. ఈ నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. భద్రకాళి ఆలయంలో మాఢ వీధుల నిర్మాణానికి రూ. 30 కోట్లు కేటాయించారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన కాళోజీ కళాక్షేత్రం అసంపూర్తిగా మిగలడంతో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దీనిపై ప్రత్యేక దృష్టిసారించారు. ప్రభుత్వంతో చర్చించి రూ. 40 కోట్లు మంజూరుచేయించారు. దీంతో పెండింగ్ పనులు పూర్తిచేసి ప్రారంభోత్వాన◌ికి కాళోజీ కళాక్షేత్రం ముస్తాబైంది. బాలసముద్రం నుంచి కాంగ్రెస్ భవన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 2 కోట్లు కేటాయించారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో రూ. 10 కోట్లతో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టారు. రూ. 6 కోట్లతో గోకుల్ నగర్ జంక్షన్ నుంచి కేయూ రోడ్డు నాలా వరకు సైడ్ డ్రైన్ నిర్మానాకికి భూమి పూజచేశారు. బాలసముద్రంలోని చిల్డ్రన్స్ పార్క్‌ను రూ. 2 కోట్లతో అభివృద్ధిచేశారు. స్మార్ట్ సిటీ నిధులు రూ. 50 కోట్లు రాబట్టి అంతర్గత రోడ్ల నిర్మాణంచేపట్టారు. అంతేగాక హన్మకొండ నగరంలోని పలు జంక్షన్ల వద్ద సుందరీకరణ పనులు చేపట్టారు. అసంపూర్తిగా మిగిలిపోయిన కాజీపేట రైల్వే ఫ్లై వోవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ. 76 కోట్లు మంజూరుచేయించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రధాన కూడళ్లు, జంక్షన్ల అభివృద్ధి కోసం రూ. 15 కోట్లతో పనులు చేపట్టారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనం కోసం రూ. 28 కోట్లు మంజూరుచేయించారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేగాక నియోజకర్గంలో అన్ని ఆర్ అండ్ బీ రోడ్ల మరమ్మతుల కోసం రూ. 50 కోట్లు మంజూరుచేయించారు. ఇవేగాక కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పార్టీలకు అతీతంగా లబ్దిదారులకు అందజేస్తున్నారు.

### గడువు కంటే ముందే..

వర్షాకాలం వచ్చిందంటే హనుమకొండ నగరంలోని అనేక కాలనీలను వరదలు ముంచేస్తుండేది. ముఖ్యంగా నయీంనగర్ నాలాకు ఇరువైపులా ఉన్న కాలనీలు నీట మునిగిపోయేవి. వరద నీటి నుంచి శాశ్వత పరిష్కారం చూపుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ప్రజలకు హామీ ఇచ్చారు. నాయిని రాజేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ముందుగా నయీంనగర్ నాలాపైనే ఆయన ప్రత్యేక దృష్టిపెట్టారు. రూ. 84 కోట్ల నిధులు తీసుకొచ్చి పెద్ద మోరీ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. కాంట్రాక్టర్లు, అధికారులను పరుగులు పెట్టించి గడువు కంటే ముందే నాలాపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించారు. అంతేగాక నయీంనగర్ పెద్ద మోరీ, రాజాజీ నగర్ బ్రిడ్జి, బొక్కలగడ్డ బ్రిడ్జి విస్తరణ పనులతో పాటు నాలాలకు ఇరువైపులా వరద ముంపు నుంచి రక్షించేందుకు 75 అడుగుల వెడల్పుతో చేపడుతున్న రిటర్నింగ్ వాల్స్ నిర్మాణం దాదాపు 90 శాతం పూర్తవడంతో స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.







# పోలీస్ అమరవీరులను మరవొద్దు

వరంగల్ సీపీ ఝా

అక్షరదర్బార్, హన్మకొండ: ప్రజల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న పోలీసులు వారి శ్రేయోభిలాషులని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ చిన్నారులకు పోలీస్ తుపాకుల పనితీరును వివరించారు. అనంతరం మాట్లాడుతూ తమ కుటుంబ క్షేమం కన్నా సమాజ క్షేమం కోసం నిరంతరం శ్రమించేది పోలీసులు మాత్రమేనని, పోలీసులను మీ స్నేహితులుగా భావించాలని, ప్రాణత్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులను మరువద్దని తెలిపారు. డీసీపీలు సలీమా, రవీందర్, అదనపు డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, దేవేందర్ రెడ్డి, ఆర్ఐలు స్పర్జన్ రాజ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, శ్రీధర్, సతీష్, ఇన్స్ స్పెక్టర్లు రవికుమార్, సత్యనారాయణరెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



యువతకు తుపాకీ పని తీరును వివరిస్తున్న సీపీ

# సోషల్ మీడియాపై అప్రమత్తం అవసరం

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

అక్షరదర్బార్, హన్మకొండ: పోలీస్ అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. కమిషనరేట్ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, దర్యాప్తు స్థితిగతులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే కార్యకలాపాలపై అధికారులకు ముందస్తు సమాచారం వుండాలన్నారు. సోషల్ మీడియాలో ప్రచారం అయ్యే కథనలపై అధికారులు దృష్టి సారించాలని, అలాగే వదంతులు వ్యాప్తి చేసే వ్యక్తులు, సంస్థలపై కన్నేసి ఉంచాలని సూచించారు. నేరాల నియంత్రణకై ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన టాస్క్ ఫోర్స్, యాంటీ డ్రగ్స్ విభాగానికి చెందిన అధికారులకు రివార్డులను అందజేశారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రవీందర్, రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీ రవితోపాటు ఏసీపీ, ఇన్స్ స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక



# హైదరాబాద్‌లో అతిపెద్ద గాంధీ విగ్రహం

**గాంధీ ఐడియాలజీ కేంద్రంగా బాపూఘాట్..**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

అక్షరదర్బార్, హైదరాబాద్: గాంధీ ఐడియాలజీ కేంద్రంగా బాపూఘాట్‌ను అంతర్జాతీయస్థాయిలో అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దేశం మొత్తం మాట్లాడుకుంటున్న సర్దార్ పటేల్ విగ్రహం తరహాలో హైదరాబాద్‌లో గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తామన్నారు. మూసీ పునరుజ్జీవాన్ని, బాపూ ఘాట్ అభివృద్ధిని బీజేపీ వ్యతిరేకిస్తోందని, కానీ గాంధీ వారసులుగా అంతర్జాతీయస్థాయిలో బాపూఘాట్‌ను అభివృద్ధి చేసి తీరుతామని స్పష్టంచేశారు. ఏబీపీ నెట్ వర్క్ నిర్వహించిన సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో పాల్గొన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఫాంహౌస్ పాలిటిక్స్ చేస్తున్నారని, దేశంలో ఎక్కడైనా ప్రతిపక్షనేత అసెంబ్లీకి రాకుండా ఉన్నారా..? కానీ తెలంగాణలో అదే జరుగుతుందని మండిపడ్డారు. అధికారం కోల్పోయినా కేసీఆర్ ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా ప్రజల తరఫున గొంతుక అసెంబ్లీలో వినిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యంపై కేసీఆర్ కు నమ్మకం ఉందా..? అని ప్రశ్నించారు.

## మహిళ మృతదేహం లభ్యం

అక్షర దర్బార్, కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో మండలంలోని గంగారం పరిధిలో గల మానేరు నదిలో గుర్తుతెలియని ఓ మహిళా మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై అభినవ్ పేర్కొన్నారు.శవం గుర్తుపట్టలేని విధంగా ఉందని సుమారు 45 ఏళ్ల మహిళా మృతదేహంగా ఉందని ఎస్సై తెలిపారు.ఎవరైనా ఆచూకీ లేని మహిళగా తెలిసినట్లయితే ఎస్సై కాటారం 8712658117 నంబరుకు కాల్ చేయాలని సూచించారు.

## రూ. వెయ్యి కోట్ల భూదందాలో
# అమోయ్ కుమార్!



- అక్రమంగా 800 ప్లాట్ల స్థలానికి పాస్ బుక్స్ ..
- ఈడీకి మధురానగర్ ప్లాట్ల యజమానుల ఫిర్యాదు
- రెండో రోజు విచారణకు హాజరైన సీనియర్ ఐఏఎస్..

అక్షరదర్బార్, హైదరాబాద్ : ఈడీ కేసు ఎంక్వయిరీతో ఇబ్బందులు పడుతున్న సీనియర్ ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్‌పై మరో పిడుగు పడింది. ఏకంగా రూ. 1000 కోట్ల ప్రాపర్టీపైన తాజాగా ఆరోపణలు వచ్చాయి. 800 ప్లాట్ల స్థలానికి రెవెన్యూ రికార్డుల్లో మార్పు చేసి పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేశారని ఈడీ జాయింట్ డైరెక్టర్‌కు మధురానగర్ ప్లాట్ల యజమానుల సంక్షేమ సంఘం ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. దశాబ్దాల క్రితం ప్లాట్లుగా అమ్మేసిన స్థలాన్ని అమోయ్.. తిరిగి అగ్రికల్చర్ ల్యాండ్ రికార్డులను మార్చేశారని ఆరోపించారు. ఈమేరకు ఫిర్యాదు కాపీతోపాటు పహానీలు, స్పెషల్ రివ్యూ ఆర్డర్ , ఇతర పత్రాలను సమర్పించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అమోయ్ కుమార్ అక్రమాలకు పాల్పడ్డారని తాము ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకుండా ప్లాట్ల యజమానులకు అన్యాయం చేశారని మధురానగర్ ప్లాట్ల యజమానులు సంఘం కేంద్ర దర్యాప్తు సంస్థకు ఫిర్యాదు చేసింది. ఇప్పటికే రెండు రోజులపాటు విచారణ ఎదుర్కొన్న అమోయ్ కుమార్‌పై మరో ఆరోపణ రావడంతో ఈడీ ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈక్రమంలోనే మూడో రోజు శనివారం కూడా ఆయన విచారణకు హాజరుకానున్నట్లు సమాచారం.

# కొండాకు బిగ్ షాక్

**కేటీఆర్ పరువు నష్టం దావాపై సిటీ సివిల్ కోర్టులో విచారణ**
**భవిష్యత్‌లో ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దంటూ**
**మంత్రి సురేఖకు ఆదేశం**



అక్షరదర్బార్, హైదరాబాద్: దేవాదాయ, అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖకు కోర్టు షాక్ ఇచ్చింది. తనపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన 100 కోట్ల పరువు నష్టం కేసులో సురేఖకు మొట్టికాయలు వేసింది. ఆమె చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయంటూ మండిపడింది. ఓ బాధ్యత గల మహిళ మంత్రి ఇలాంటి కామెంట్స్ చేయటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని పేర్కొన్నది. కేటీఆర్ పై కొండా సురేఖ వ్యాఖ్యలను హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు సీరియస్ గా పరిగణించింది. భవిష్యత్ లో ఇంకెప్పుడూ ఇలాంటి అడ్డగోలు వ్యాఖ్యలను కేటీఆర్ పై చేయవద్దని కొండాను సురేఖను ఆదేశించింది. అత్యంత జుగుప్సాకరంగా ఉన్న ఆ వ్యాఖ్యలను మీడియా, సోషల్ మీడియా, వెబ్ సైట్లు, అన్ని సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది.

# ఏసీబీ వలలో ఇద్దరు ఉద్యోగులు

- లంచం తీసుకుంటూ పట్టుబడిన
- ఘట్‌కేసర్ మున్సిపల్ ఏఈ రాజశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ షమీ

అక్షరదర్బార్, ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. మున్సిపల్ ఏఈ రాజశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ షమీ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఓ కాంట్రాక్టర్ నుంచి మున్సిపల్ ఏఈ రాజశేఖర్ రూ. 50 వేలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రూ. 30 వేలు డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా శుక్రవారం వలపన్ని పట్టుకున్నారు. ఇద్దరు ఉద్యోగులపై కేసు నమోదు చేశారు.

# కేసీ వేణుగోపాల్ తో భట్టి భేటీ..

**కుల గణన సర్వే ఫార్మాట్ అందజేత**



కులగణన ఫార్మాట్ అందజేస్తున్న భట్టి

అక్షరదర్బార్, న్యూఢిల్లీ: ఏఐసీసీ జనరల్ సెక్రటరీ (ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్‌ను ఆయన నివాసంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కలిశారు. రాహుల్ గాంధీ తెలంగాణ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు.. కుల గణనను రాష్ట్రం నుంచే ప్రారంభించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కేసీ వేణుగోపాల్‌కు వివరించారు. సర్వే ఫార్మాట్‌ను వేణుగోపాల్‌కు అందజేశారు. భట్టి విక్రమార్క ఫార్మాట్‌ను అన్ని కోణాల్లో పరిశీలించిన వేణుగోపాల్ దాదాపు గా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు పార్టీ అంతర్గత సమాచారం. ఈ సర్వే సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కోణంలో నిర్వహించనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా కులగణన అంశంపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం సైతం చేసింది. కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## పంబాల కులవృత్తి జిల్లా
# అధ్యక్షుడిగా రౌతు హరికృష్ణ



రౌతు హరికృష్ణ, గడ్డం రాజయ్య

అక్షర దర్బార్, దుగ్గొండి : పంబాల కులవృత్తి జిల్లా అధ్యక్షుడిగా రౌతు హరికృష్ణ, రాష్ట్ర కార్యదర్శులుగా గడ్డం రాజయ్య నియామకమయ్యారు. మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన రౌతు హరికృష్ణ తెలంగాణ పంబాల కులవృత్తి కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అదేవిధంగా ఇదే గ్రామానికి చెందిన గడ్డం రాజయ్య తెలంగాణ పంబాల కుల వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు పదవీ బాధ్యతలు కల్పించిన తెలంగాణ పంబాల కులవృత్తి రాష్ట్ర అధ్యక్షుడు సుద్దాల కుమారస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల పాండు, వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల భూపాల్ రాజు, కోశాధికారి బత్తుల శ్రీనివాస్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మరుగున పడిన పంబాల కులవృత్తి కళాకారుల అభివృద్ధికి మావంతుగా అహర్నిశలుగా కృషి చేస్తామని, ఎస్సీ ఉప కులాల్లో భాగంగా పంబాల కులస్తులందరికీ ఎస్సీ పంబాల కుల ధ్రువీకరణ వచ్చేంతవరకు పోరాడుతామని వారు హామీ ఇచ్చారు. తెలంగాణ పంబాల కులవృత్తి కళాకారుల సంఘం కట్టుబాట్లకు అనుగుణంగా పంబాల కులవృత్తి కళాకారుల అభివృద్ధి కోసం సేవలు అందిస్తామని వారు అన్నారు.

# పైపులైన్ పనులు

అక్షర దర్బార్, పరకాల : నడికూడ మండల కేంద్రంలో 8 వ వార్డులో ని పైపులైన్ మట్టి కూలడంతో ప్రజలకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ప్రజల ఇబ్బందిని గమనించి సిడిఎఫ్ నిధుల నుండి పైప్ లైన్ వేశారు. ఇందులో భాగంగా స్పెషల్ ఆఫీసర్ చేతన్ రెడ్డి, కార్యదర్శి సందీప్, మాజీ సర్పంచ్ ఊర రవీందర్రావు, మాజీ ఉపసర్పంచ్ కిన్నర మణి, గుడిసెలు రంజిత్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న అధికారి



# నిలిచిన పత్తి కొనుగోళ్లు

- ధర తగ్గిందని అన్నదాతల ఆందోళన
- రైతు సంఘాలు , ఖరీదు దారులతో చర్చలు జరిపిన మార్కెట్ కార్యదర్శి
- ఫలించని చర్యలు

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధర తగ్గిందని రైతులు ఆందోళనకు దిగారు. మార్కెట్‌లోని ఖరీదుదారులు పత్తికి తక్కువ ధర నిర్ణయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. మార్కెట్ కార్యదర్శి నిర్మల రైతు సంఘాల ప్రతినిధులు, ఖరీదుదారులతో చర్చలు జరిపినప్పటికీ ఫలితంలేకుండా పోయింది.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ తనిఖీ

అక్షర దర్బార్ మల్హర్ : తాడిచెర్ల గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజన ఆశ్రమం పాఠశాలను ఆకస్మికంగా సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ అవినాష్ హాస్టల్ వార్డెన్ మరియు ప్రధానోపాధ్యాయురాలు తో మాట్లాడి పిల్లల కావాల్సిన మౌలిక వసతులు, అదేవిధంగా ఏఎన్ఎంతో మాట్లాడి.. పిల్లల యొక్క ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడం జరిగింది. అదేవిధంగా మండల స్పెషల్ ఆఫీసర్ ఆర్ అవినాష్ ఆశ్రమ పాఠశాలలో పిల్లలతో మాట్లాడి, విద్య బోధన అవసరమైన మేరకు డిజిటల్ క్లాస్ రూపంలో అందించాలని ఉపాధ్యాయులకు ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే.శ్యాంసుందర్, ఎంపీవో బీ. విక్రమ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి చెలకల రాజు యాదవ్ , గ్రామపంచాయతీ కారోబార్ అజ్మత్ అలీ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్

# కాపులకనపర్తి స్కూల్ లో కలెక్టర్ సీరియస్

- మధ్యాహ్న భోజనం సరిపోకపోవడంపై ఆగ్రహం
- ప్రధానోపాధ్యాయుడికి షోకాజు నోటీసు జారీకి ఆదేశాలు
- అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పరిశీలన

అక్షరదర్బార్, వరంగల్: జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. శుక్రవారం వర్ధన్నపేట మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ ఉర్దూ, తెలుగు మీడియం పాఠశాలలను, కట్యాల జెడ్పీపీఎస్ పాఠశాలను సంగెం మండలంలోని కొత్తగూడెం, కాపులకనపర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు గుర్తించి చేపట్టిన అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు 645 అభివృద్ధి పనులను గుర్తించి మంజూరు చేయగా అందులో సుమారు 400 పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తయిన పనులకు బిల్లుల చెల్లింపు నిమిత్తం చిత్రాలతో సహా సంబంధిత ఇంజనీర్ తో ధ్రువీకరించి పంపాలన్నారు. కాపులకనపర్తి పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందియాలని, మధ్యాహ్న భోజనం విద్యార్థులకు సరిపోకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రధానోపాధ్యాయునికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లో పెరిగిన పిచ్చి చెట్లను తొలగించాలని, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్ బ్లాక్ ను వెంటనే మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



# క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- ఘనంగా అండర్ 19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభం

అక్షరదర్బార్, హనుమకొండ: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జెఎన్ఎస్ లో అండర్-19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించారు. డివైఎస్ఓ గుగులోతు అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు. ఉమ్మడి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అజీజ్ ఖాన్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం వల్ల నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, అలాగే స్నేహపూర్వక వాతావరణం క్రీడల్లో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. పోటీల ఆర్గనైజింగ్ సెక్రెటరీ , డివైఎస్ఓ గుగులోతు అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని అందులో రేపు నిర్వహించబోయే క్రీడాంశాలు కోకో, టైక్వాండో, బాక్సింగ్, చెస్, జిమ్నాస్టిక్స్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, ఫెన్సింగ్, అథ్లెటిక్స్ మొదలగు క్రీడలు జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించ బడునని, ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, లేటెస్ట్ బోనఫైడ్, ఎస్ఎస్ సి మెమో జిరాక్స్ లపై తప్పనిసరిగా కాలేజ్ ప్రిన్సిపల్ సంతకం చేయించుకొని ఉదయం 8 గంటలకు జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో హాజరుకావాలని సూచించారు. జూడో క్రీడాంశము ఓ సిటీ స్టేడియంలో నిర్వహించబడును. కార్యక్రమంలో హనుమకొండ వరంగల్ డిఐఈఓ గోపాల్ రావు, డాక్టర్ శ్రీధర్, వెంకట్ రెడ్డి, దస్రు నాయక్, బరపాటి గోపి, సతీష్, ప్రభాకర్ రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలకు హాజరైన క్రీడాకారులు

# అడవిలో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన పోలీసులు

అక్షర దర్బార్ మల్హర్ : గూగుల్ మ్యాప్ ప్రయాణం ప్రాణ సంకటనలో పడేసింది. ఒకరు అటవిలో చిక్కుకుని ప్రాణభయంతో వందకు డయల్ చేయడంతో పోలీసులు రక్షించిన సంఘటన మండలంలో బుధవారం రాత్రి జరిగింది. ఆలస్యంగా తెలిసిన సమాచారం కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్ కథనం మేరకు ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన జస్వ అనే వ్యక్తి గూగుల్ వే మ్యాప్ ద్వారా మంచిర్యాల నుంచి ఖమ్మం జిల్లాకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. పెద్దపల్లి జిల్లా మంథని, ఖమ్మంపల్లి మానేరు బ్రిడ్జి నుంచి మండలంలోని తాడిచర్ల, కిషన్ రావు పల్లి భూపాలపల్లి రూట్ మ్యాప్ చూపించడంతో జస్వ ఆ రూట్ మ్యాప్ ద్వారా రవాణా కొనసాగించి అర్ధరాత్రి కిషన్రావుపల్లి ఫారెస్ట్ లో తప్పిపోయాడు.వందకు డయల్ చేయడంతో కొయ్యూరు ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ద్వారా అదే రాత్రి రెండు గంటలు శ్రమించి అటవీని జల్లెడ పట్టి తప్పిపోయిన వ్యక్తిని రక్షించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా అటవీ దారి తప్పిపోవడం ద్విచక్ర వాహనం చెడిపోవడం వల్ల జస్వ అటవీలో భయభ్రాంతులకు గురయ్యాడు. దీంతో వందకు డయల్ చేయగా తమ సిబ్బంది అప్రమత్తమై గ్రామస్తుల సహకారంతో ట్రాక్టర్ ద్వారా ద్విచక్ర వాహనాన్ని తరలించి సురక్షితంగా గురువారం ఖమ్మం పంపించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



గూగుల్ వే రూట్ మ్యాప్ కొంత బేష్ ఐన మరికొంత కష్టంగా ఉంటుంది. ఇప్పటికైనా గ్రహించండి మీ ప్రయాణాన్ని సురక్షితంగా చేరుకునేలా జాగ్రత్తలు పాటించాలని ఎస్సై సూచించారు.